క్లుప్తంగా

కాజీపేట ట్రాఫిక్ సీఐగా వెంకన్న



కాజీపేట : కాజీపేట ట్రాఫిక్ సీఐగా పి.వెంకన్న ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న నాగబాబుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఏహెచ్‌టీయులో పనిచేస్తున్న వెంకన్నను కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా అధికారులను కలిశారు. ట్రాఫిక్ సిబ్బంది నూతన సీఐని అభినందించారు.

జయప్రదం చేయాలి

న్యూశాయంపేట/హసన్‌పర్తి : హసన్‌పర్తిలో నేటి(సోమవారం) నుంచి జరుగుతున్న హనుమకొండ జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. ఆదివారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్ల కాలంలో పార్టీ పేదలు, కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులు వృత్తిదారులు సామాజిక సమస్యలపై చేసిన పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్ పోరాటాలను రూపకల్పన చేసుకునేందుకు మహాసభలను జరుపుకుంటున్నామన్నారు. మొదటి రోజు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ సభలను ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా రవీందర్



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

మడికొండ: మడికొండ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా బిల్లా రవీందర్‌ను ఎంపిక చేసినట్లు సంఘం మాజీ అధ్యక్షుడు కామిని మల్లేశం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా వంగ రమేశ్, సహాయ కార్యదర్శిగా పొట్లబత్తిని మహేష్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కార్యవర్గం సభ్యులు మార్కండేయ స్వామి గుడి నిర్మాణానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు బిల్లా లింగయ్య, కోమాకుల సమ్మయ్య, నామని మోహన్‌రావు, పోతరాజు ప్రకాశ్, నామని సదానందం, పోట్లబత్తిని లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టీజీటీఎస్పీ కమాండెంట్‌ను కలిసిన ఆర్ఐ




మామునూరు : టీజీ టీఎస్పీ ఐదో బెటాలియన్ చల్వాయికి చెందిన ఆర్ఐ కార్తీక్ మామునూరు నాలుగో బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. శనివారం నాలుగో బెటాలియన్‌లో ఆర్ఐగా బాధ్యతలు చేపట్టగా ఆదివారం బెటాలియన్ కమాండెంట్ రామ్‌ప్రకాశ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీఎన్‌జీఓ అనుబంధ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ధర్మరాజు



న్యూశాయంపేట : తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ (టీఎన్‌జీఓ అసోసియేషన్ అనుబంధం) వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా వరంగల్ నగరానికి చెందిన బందెల ధర్మరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వరంగల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా పి.కిషన్, కోశాధికారిగా ఎం.ఐలయ్యతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

‘మన్‌కీ బాత్ ’ కార్యక్రమం



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ధర్మారావు

హసన్‌పర్తి : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు వీక్షించారు. కార్పొరేటర్ శివకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి, రైల్వే బోర్డు సభ్యులు దాసరి రాజు, హరిశంకర్, సుమన్ పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

- అంతర్గ రోడ్లతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- సైడ్ డ్రెయినేజీ లేక రోడ్లపై నిలుస్తున్న మురుగునీరు



అంబేద్కర్ కాలనీలో దెబ్బతిన్న సైడు కాల్వలు



వినాయక నగర్‌లో చిత్తడిగా మారిన రోడ్డు

మడికొండ: 64వ డివిజన్ మడికొండలో వినాయక నగర్, అంబేద్కర్ కాలనీలలో అంతర్గత రోడ్లు చినుకు పడితే చిత్తడవుతున్నాయి. సైడ్ డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్లపై నిలుస్తున్న మురుగునీరు, అందులో దోమలు పెరిగి డెంగీ, మలేరియా లాంటి జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో రోడ్లు సైడ్ డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. గతంలో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే అరూరి రమేశ్ రోడ్లు, సైడ్ డ్రెయినేజీ నిర్మిస్తానని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అయిన త్వరగా రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించాలని కోరుతున్నారు.

పూర్తిగా ధ్వంసమైన రోడ్లు



మా కాలనీలో 20 ఏళ్ల క్రితం వేసిన రోడ్లు పూర్తిగా ధ్వసం కావడంతో నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. వర్షం పడితే బయటకు వెళ్లలేని పరిస్థితి, సైడ్ కాల్వలు, సీసీ రోడ్లు సరిగా లేక పోవడంతో మురుగు నీరు ఇంటి ముందు నుంచి వెళ్తున్నాయి.

– కొత్తకొండ వెంకటేశ్వర్లుగౌడ్, స్థానికుడు

సైడు కాల్వలు నిర్మించాలి



గ్రామ పంచాయతీ ఉన్న కాలంలో ఉన్న సీసీ రోడ్లు, సైడ్ కాల్వలు పూర్తిగా దెబ్బతినడంతో నడవడానికి ఇబ్బందిగా మారింది. కాల్వలో మురుగు నీరు నిలవడంతో అందులో పందులు చేరి దుర్గంధం వెదజల్లుతున్నాయి. అధికారులు స్పందించి సీసీ రోడ్లు, కాల్వలు నిర్మించాలి.

– అంకేశ్వరపు రమేశ్, అంబేద్కర్ కాలనీ

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



ఎల్‌బీ నగర్ జంక్షన్‌లో మానవహారంలో పాల్గొన్న ముస్లింలు

హన్మకొండ చౌరస్తా/న్యూశాయంపేట: కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ నూతన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముస్లిం పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాయపుర మజీద్, గ్రేటర్ వరంగల్ పరిధిలోని కాజీపేట, సుబేదారి, అదాలత్ సర్కిల్, నక్కలగుట్ట, అంబేద్కర్ జంక్షన్, హనుమకొండ చౌరస్తా, ములుగురోడ్డు, వరంగల్ మంచి బజార్, ఎల్‌బీనగర్, శంభునిపేట, చింతల్, లేబర్‌కాలనీ వద్ద ఆదివారం సాయంత్రం మానవహారం నిర్వహించారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి జాక్ బాధ్యుడు మహ్మద్ నయీమొద్దీన్ మాట్లాడుతు భారతదేశ ముస్లింలు అందరూ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న విషయాన్ని కేంద్రం గుర్తించాలని అన్నారు. ఈ చట్టం వలన విలువైన భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర దాగివుందన్నారు. మానవహారం ద్వారా ముస్లిం ఐక్యతను , సవరణ చట్టం ద్వారా ముస్లింలకు జరిగే అన్యాయాన్ని దేశ వ్యాప్తంగా చాటుతున్నామని అన్నారు. కార్యక్రమంలో షఫీ, అఫ్జల్, సాజిద్‌ఖాన్, మోయిన్ అలీ, మాజీద్ ఫర్షీద్, జుబేర్ గఫూరీ, ఎండి ఎజాజ్, అలీజుబేర్, హాఫీజ్ అన్వార్, తౌసీఫ్, ఇస్మాయిల్, సోహెల్, రహీం, మౌలానా ఫసియొద్దీన్ ఖాస్మీ, అతీఖుర్‌రహమాన్, కార్పొరేటర్ ఫుర్ఖాన్, అబ్దుల్ సుభాన్, సయ్యద్ మసూద్, అబ్దుల్ ఖుద్దూస్, ఇస్మాయిల్ షంషీ,నయిమ్, తౌసీఫ్, అజర్, సిరాజ్ అహ్మద్ అబ్దుల్లా పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల నియామకం



ప్రోగ్రాం ఆఫీసర్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్ : యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీలో జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) ప్రోగ్రాం ఆఫీసర్లుగా ముగ్గురిని నియమిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. కంప్యూటర్ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ శ్రీలత, సంస్కృత విభాగం అధ్యాపకుడు చందర్, కామర్స్ విభాగం అధ్యాపకుడు రమేష్‌ను ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లుగా నియామక ఉత్తర్వులు అందజేసినట్లు ఆదివారం తెలిపారు. విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు క్రమశిక్షణ విలువలు పెంచేందుకు ఎన్‌ఎస్‌ఎస్ దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లను ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, అధ్యాపకులు అభినందించారు.

మృతదేహాన్ని తీసుకురావడానికి వెళ్తున్నాం

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

హసన్‌పర్తి : ఛత్తీస్‌గఢ్ మాడ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్ట్ రాకేష్ మృతదేహాన్ని తీసుకురావడానికి వెళ్తున్నామని కుటుంబ సభ్యులు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై స్టాంప్ వేసిన నకలుపత్రంతో కుటుంబసభ్యులు నారాయణపూర్‌కు బయల్దేరారు. ఎన్‌కౌంటర్ జరిగి ఐదు రోజులు గడుస్తున్నప్పటికీ రాకేష్ మృతదేహం మార్చురీలోనే భద్రపరిచారన్నారని, నాలుగు రోజుల క్రితం మృతుడి తండ్రి బాబుతో పాటు మరి కొంతమంది ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి మృతదేహాన్ని తీసుకురావడానికి వెళ్లినప్పటికీ అక్కడి పోలీస్ అధికారులు సంబంధించిన కాగితాలపై సంతకాలు కూడా చేయించుకుని మృతదేహం అప్పగించడానికి నిరాకరిస్తున్నారు. అక్కడి పోలీస్ అధికారుల సూచనల మేరకు కుటుంబ సభ్యులు కేయూ పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం వరకు మృతదేహం చింతగట్టుకు చేరుకునే అవకాశం ఉందని తెలిపారు.

ఈఈ పై చర్య తీసుకోవాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ రికార్డుల్లో లేని నాలాని డిజిటల్ సర్వేలో ఉన్నట్లుగా చూపిస్తూ అర్థంతరంగా తమ నిర్మాణాన్ని అడ్డుకొని తమను ఇబ్బందులు సృష్టిస్తున్న సంబంధిత ఇరిగేషన్ ఈఈపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని బాధితుడు రమేష్, అతని కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులను వేడుకున్నారు. ఆదివారం హంటర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ పంథిని గ్రామంలో సర్వే నెంబర్ 323లో రైతుల వద్ద కొనుగోలు చేసి నిబంధనల ప్రకారం అన్ని అనుమతులతో ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో అన్ని అనుమతులు వచ్చాక ఇరిగేషన్ శాఖ ఈఈ కొత్తగా డిజిటల్ సర్వే పేరుతో అక్కడ నాలా ఉందని పనులు అడ్డుకున్నారని, దాదాపు 90 శాతం పనులు పూర్తయిన తర్వాత ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు సర్వేల పేరుతో పనులు ఆపారని తెలిపారు. ఈ విషయం పై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం


కల్వర్టుపై లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం



బోల్తాపడిన లారీ

మడికొండ : కడిపికొండ కల్వర్టుపై ప్రమాదవశాత్తు బొగ్గు లారీ వరంగల్ నుంచి రాజమండ్రికి తరలుతుండగా బ్రిడ్జిపై బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా సంఘటన స్థలానికి చేరుకున్న మడికొండ సీఐ కిషన్, ఎస్సై, పోలీసు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. స్పందించిన పోలీసులు వెంటనే జేసీబీల సాయంతో లారీని పక్కకు తప్పించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

చెరువులో చేపల పట్టివేత



మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు పెద్ద చెరువులో ఆదివారం మత్స్యకారులు చేపలు పట్టారు. తొలిరోజు సుమారు 6 క్వింటాళ్ల చేపలు పట్టినట్లు మత్స్యకారులు పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం చెరువు గట్టుపై కి భారీగా చేరుకున్నారు. మత్స్యకారులు పట్టిన బొచ్చ, రవుల చేపలను రూ.130 నుంచి 150 వరకు ధర పెట్టి కొనుగోలు చేశారు. పట్టిన వెంటనే కొనుగోలు చేసేందుకు ఎక్కువ సంఖ్యలో ప్రజలు రావడంతో మత్స్యకారుల ఆనందం వెల్లివిరిసింది.

రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

కాజీపేట రూరల్ : కాజీపేట జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం గుర్తుతెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ సీఐ వి.నరేష్‌కుమార్ కథనం ప్రకారం. నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలో డౌన్‌లైన్‌లో గుర్తు తెలియని సుమారు 30 ఏళ్ల యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపిస్తుంది. రైలు పట్టాలపై తల, మొండెం వేరై పడి ఉన్నాయి. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు నలుపురంగు జీన్స్ ప్యాంటు, ఎరుపురంగు టీ షర్టు ధరించాడు. లవ్ అని ఇంగ్లిష్ అక్షరాలు రాసి ఉన్న బెల్టు ధరించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 8712568532 సెల్‌నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

శ్వేతార్క ఆలయంలో చండీహోమం

కాజీపేట : స్థానిక స్వయంభు శ్రీ శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో ఆదివారం మాస శివరాత్రిని పురస్కరించుకుని నిత్య మాసోత్సవ చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ ప్రేమ్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు జరిపించారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ దంపతులతో పాటు 108 జంటలు భాగస్వామ్యం పంచుకున్నాయి. నిర్వాహకులు సాయికృష్ణ శర్మ, ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు శర్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. టీచర్స్ కాలనీ–2, జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

విహర గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం



హన్మకొండ : హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్ భవానీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విహర గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను వరంగల్ పశ్చిమ, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. నిరుద్యోగులు స్వయం ఉపాధి కోసం ఈ హోటల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యేలు అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుజ్జుల వసంత, కాంగ్రెస్ నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు



హసన్‌పర్తి : 56వ డివిజన్‌లో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి : విలీన గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. నగరంలోని 56వ డివిజన్ వివేక్‌నగర్ కాలనీలో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు, గోపాలపురం చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. రూ.4.5 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. రానున్న మూడేళ్లల్లో గల్లీగల్లీకి సీసీ రోడ్లతో పాటు మురికి కాల్వల నిర్మాణం చేపడతానన్నారు. రాష్ట్రంలోనే వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. గోపాలపురం చెరువు పరిరక్షిస్తామన్నారు. చెరువు కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏమైన సమస్యలు ఉన్న 8096107107 ఫోన్‌కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, సీనియర్ పున్నంచందర్, ప్రభాకర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

న్యూశాయంపేట : వరంగల్ నగర పరిధిలోని 14వ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణానికి ఆదివారం వరన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ తుర్పాటి సులోచన, నాయకులు సారయ్య, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోరాటానికి ప్రజలను సిద్ధం చేయాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు

ఖిలా వరంగల్ : పాటలతో ప్రజలను చైతన్యపరిచి పోరాటాలకు ప్రజలను సిద్ధం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజానాట్య మండలి 83వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనంతరం సువర్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రజానాట్య మండలి ప్రజలను చైతన్య పరిచిందని అన్నారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు పాటలు, నాటికలు, కథల రూపంలో ఎలుగెత్తి చాటిందన్నారు. రానున్న రోజుల్లో పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలుస్తారని చెప్పారు. అంతకు ముందు ప్రజానాట్య మండలి జెండాను ఆవిష్కరించి ఉత్తమ కళాకారులకు మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కే. బాషమియా, గన్నారపు రమేష్, దామెర కృష్ణ, ఆరెల్లి రవి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్ ఫలితాల్లో ‘ ఐరా అకాడమీ ’ ప్రభంజనం



శ్రీజ (2వ ర్యాంక్)



గణేష్ (15వ ర్యాంక్)



చాణక్య (19వ ర్యాంక్)

రామన్నపేట : రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఈసెట్ ఫలితాల్లో ఐరా అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని డైరెక్టర్లు ఎన్ఎస్ రెడ్డి, దేవా తెలిపారు. మెకానిక్ విభాగంలో గూడ గణేష్ (15వ ర్యాంక్), పిట్టల చాణక్య (19వ ర్యాంక్), ఊరుగొండ శ్రావణ్ (27వ ర్యాంక్), కీర్తి గణేష్ (28వ ర్యాంక్), కంప్యూటర్ సైన్స్ విభాగంలో వెలుదండి శ్రీజ (2వ ర్యాంకు), ఎస్.అంజని (37వ ర్యాంక్), సిహెచ్.కీర్తిశ్రీ (61వ ర్యాంక్), ఎలక్ట్రికల్ విభాగంలో కొర్ర మధుప్రియ (24వ ర్యాంక్), బండారి చైత్ర (54వ ర్యాంక్)లతో పాటు పలువురు విద్యార్థులు 100 లోపు ర్యాంకులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, సహకరించిన అధ్యాపకులు, తల్లిదండ్రులను వారు అభినందించారు.

గ్రాండ్‌గా స్కిల్ స్టార్క్ సెలబ్రేషన్స్



పారంభం కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని, ఎర్రబెల్లి తిరుమలరావు, తదితురులు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 6వ డివిజన్ కిషన్‌పురలో స్కిల్ స్టార్క్ స్కూల్ ఆధ్వర్యంలో ఎర్లీ లెర్నింగ్ క్యాంపస్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమలరావు, వైస్ చైర్మన్ డాక్టర్ సువర్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్.నాగరాజు, ఎంపీ కడియం కావ్య హాజరై స్కిల్ స్టార్క్ విద్యాసంస్థల ఫౌండర్ అనూప్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, డాక్టర్లు శివసుబ్రహ్మణ్యం, రమేష్, సుమిత్ర, శ్రావణ్‌కుమార్ రామారావు, కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి, జనార్దన్ తదితరులు హాజరై యాజమాన్యానానికి అభినందనలు తెలిపారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



జయసింహారెడ్డిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్ : సివిల్స్‌లో 46వ ర్యాంకు సాధించిన రావుల జయసింహారెడ్డిని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం శాలువాతో సత్కరించి మెమొంటోలు అందించి ఘనంగా సన్మానించారు. ఆదివారం సుబేదారిలోని పొద్దుటూరి జ్యూయెల్ లగ్జరీ బ్లాంకెట్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జయసింహారెడ్డితో పాటు అతని తల్లిదండ్రులు ఉమారెడ్డి –లక్ష్మి దంపతులను శాలువాతో సత్కరించారు. సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, రాజిరెడ్డి నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, విద్యాసాగర్, జైహింద్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హన్మకొండ : స్నేహనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మేయర్ సుధారాణి

హన్మకొండ : అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం 59వ డివిజన్ హనుమకొండలోని ఇందిరానగర్‌లో రూ.32 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు వెడల్పు పనులకు మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ గుజ్జుల వసంతతో కలిసి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అదే విధంగా ఎక్సైజ్ కాలనీలో రూ.79.30 లక్షలతో నిర్మించిన వెడల్పుగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం స్నేహనగర్‌లో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మేయర్ సుధారాణి, కార్పొరేటర్ వసంతతో కలిసి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మౌళిక వసతుల సదుపాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. వర్షాకాలంలో కాలనీలు ముంపునకు గురి కాకుండా చూడడపై తన ముందు ప్రథమ కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో వరంగల్ మహానగర పాలక సంస్థ డీఈ సారంగం, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, ఇందిరానగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దొంగల శ్రీనివాస్ కార్యదర్శి తేళ్ళ కిశోర్, వైస్ ప్రెసిడెంట్ పూరెల్లి రవి కిరణ్, పీసీసీ సభ్యుడు ఈవీ శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ నాయకులు బంక సంపత్, నాయిని లక్ష్మా రెడ్డి, ఎనుకంటి నాగరాజు, దీపక్ రెడ్డి, సుగుణ, మండల సమ్మయ్య పాల్గొన్నారు.

డివిజన్లలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

కాజీపేట అర్బన్ : పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధిలోని నందిహిల్స్‌లో ఆదివారం రూ.50 లక్షల నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేపట్టి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, నందిహిల్స్ కాలనీ వాసులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

గోడ నిర్మాణానికి శంకుస్థాపన

నయీంనగర్ : 6వ డివిజన్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న ఈద్గా ప్రహరీ, ప్రార్థన స్థల నిర్మాణానికి ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత లోపం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు జియాఉద్దీన్, శివాజీ, రాజు, బియాబాని, అజీజ్, మన్సూర్, రహీం, తదితరులు పాల్గొన్నారు.